క్లుప్తంగా

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



అక్కంపల్లిలో మొక్క నాటుతున్న ఎంపీఓ తదితరులు

యాలాల: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని యాలాల ఎంపీఓ యాదయ్య అన్నారు. బుధవారం మండల పరిధిలోని అక్కంపల్లి, చెన్నారం గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా అందరూ మొక్కలు నాటాలన్నారు. కాలుష్య నివారణకు మొక్కల పెంపకం ఎంతో ప్రాముఖ్యమన్నారు. అనంతరం పంచాయతీ సిబ్బందిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధిలో అధికారుల పాత్ర కీలకం



అధికారులను సన్మానిస్తున్న గ్రామస్తులు

కుల్కచర్ల: గ్రామాలు అభివృద్ధి చెందాలంటే అధికారులు నిబద్ధతతో పనిచేయాల్సి ఉంటుందని మాజీ ఎంపీపీ అంజిలయ్యగౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని అంతారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో వరుసగా మూడుసార్లు జిల్లా ఉత్తమ ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఎంపికైన చంద్రమౌళిని సన్మానించారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎల్లయ్య, టెక్నికల్ అసిస్టెంట్ నరేష్‌లను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు మొగులయ్య, సాయన్న, జలీల్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలకు కళ్లెం

పెద్దేముల్ ఎస్ఐ గిరి



సీసీ కెమెరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

పెద్దేముల్: ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని పెద్దేముల్ ఎస్ఐ గిరి అన్నారు. బుధవారం మండలంలోని గోపాల్‌పూర్ గ్రామంలో సీసీ కెమెరాలు, మూఢ నమ్మకాలు, దొంగతనాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ చేయవచ్చన్నారు. తాండూరు నుంచి జహీరాబాద్ వెళ్లే మార్గంలో గోపాల్‌పూర్ ప్రధాన కేంద్రమన్నారు. ప్రతి గ్రామంలో గ్రామస్తుల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటి ఏర్పాటుకు సానుకూలంగా స్థానికులు స్పందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత ముఖ్యం



వీధులను శుభ్రం చేస్తున్న ఎంపీడీఓ విశ్వప్రసాద్

తాండూరు రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తాండూరు ఎంపీడీఓ విశ్వప్రసాద్ సూచించారు. ఎంపీడీఓ కార్యాలయం, అంతారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన గాంధీ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గ్రామస్తులతో కలిసి చీపురు పట్టి విధులను శుభ్రం చేశారు. గ్రామస్తులందరూ కలిస్తేనే గ్రామం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యానారాయణరెడ్డి, గ్రామస్తులు శ్రీను, శాంతు, మొగులప్ప పాల్గొన్నారు.

సన్మానం



దోమ: డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించిన దాదాపూర్ వాసి శ్యామ్‌ను గ్రామస్తులు అభినందించారు. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువకులు శివ, శ్రీను, శేఖర్, జనార్దన్, కృష్ణ, చెన్న తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు వేళాయె



శ్రీ లక్ష్మీ అనంతపద్మనాభ స్వామి ఆలయం



మూల విరాట్

నేటి నుంచి అనంతుడి కోవెలలో దసరా ఉత్సవాలు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం ఆలంపల్లిలోని శ్రీ లక్ష్మీ అనంతపద్మనాభ స్వామి ఆలయంలో నేటి నుంచి దసరా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పద్మనాభం, ఈఓ నరేందర్ తెలిపారు. అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. గురువారం సాయంత్రం ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. నిత్యం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలతో పాటు రాత్రి 7 గంటలకు వాహన సేవ ఉంటుందన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో..

అనంతగిరి: వికారాబాద్ పట్టణం ఆలంపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో కొలువైన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు ఆలయ ధర్మకర్తల మండలి ప్రతినిధులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలని విజయవంతం చేయాలని ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పగిడాల లక్ష్మీనారాయణ కోరారు.

దసరా ఉత్సవాలకు ముస్తాబు

అనంతగిరి: దసరా నవరాత్రుల సందర్భంగా గురువారం నుంచి అమ్మవారి ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. వికారాబాద్ చుట్టు పక్కల గ్రామాలతో పాటు వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని వైభవలక్ష్మి ఆలయం, రాం మందిరం, మల్లికార్జున ఆలయం, శివారెడ్డి పేటలోని తుల్జాభవానిమాత ఆలయం, కమలానగర్ మహాలక్ష్మి ఆలయం, వెంకటపూర్ తండాలో వెలసిన అమ్మవారి ఆలయాలతోపాటు ఆయా వాడల్లో సైతం అమ్మవారిని ప్రతిష్ఠించనున్నారు.

నవరాత్రులకు మండపం సిద్ధం

కొడంగల్: దేవీ నవరాత్రుల ఉత్సవాలకు పట్టణంలోని సిటిజన్ క్లబ్‌లో మండపాన్ని సిద్ధం చేశారు. సనాతన ధర్మ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం అమ్మవారిని ప్రతిష్ఠించనున్నారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, అధ్యక్షుడిగా కోట్రికె లక్ష్మీనారాయణ గుప్తా, ప్రధాన కార్యదర్శులుగా మరాఠ రాజు, ప్రవీణ్‌లను ఎన్నుకున్నారు. ధర్మ రక్షణ కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని సభ్యులు కోరారు.



మండపం వద్ద ధర్మ పరిరక్షణ కమిటీ సభ్యులు

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు అండ

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు టౌన్: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం తాండూరు పట్టణానికి చెందిన ఆఫ్రీన్ బేగంకు రూ.2 లక్షలు, పెద్దేముల్ మండల కేంద్రానికి చెందిన ఎస్.పద్మమ్మ కుటుంబ సభ్యులకు రూ. 2.5లక్షల సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలకు కార్పొరేట్ తరహాలో వైద్యం అందజేసేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నియోజకవర్గంలోని ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చినా నేరుగా తనకు తెలియజేస్తే సహాయం అందజేస్తానన్నారు.

ప్రత్యేక అభిమానం

కుల్కచర్ల: సొంతూరి నాయకుడిపై ఉన్న అభిమానాన్ని ఓ యువకుడు వినూత్నంగా చాటుకున్నారు. సముద్రపు ఇసుకతో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చిత్రాన్ని రూపొందించారు. బుధవారం మండలంలోని తిర్మలాపూర్ స్వగ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేను స్థానిక యువకులతో కలిసి ఉత్తమ్‌కుమార్ తాను రూపొందించిన చిత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. నేటితరం యువతలో ఎంతో నైపుణ్యం ఉందని వారికి మరింత ప్రోత్సాహం ఇచ్చేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య, మాజీ ఎంపీటీసీ రాంలాల్ తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్ల: ఇసుకతో చేసిన చిత్రాన్ని ఎమ్మెల్యేకు అందిస్తున్న ఉత్తమ్‌కుమార్, స్థానికులు

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

పూడూరు: మారుమూల గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని రాకంచర్లలో హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్హులందరికీ ఆరు గ్యారంటీలను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, మాజీ సర్పంచ్ పెంటయ్య, నాయకులు వెంకట్‌రాంరెడ్డి, జితేందర్‌రెడ్డి, సాయన్న, పరశురాం తదితరులు పాల్గొన్నారు.



హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

ఉపాధి పనులపై గ్రామ సభలు



మర్పల్లి: మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి, ఈసీ విఠల్



దుద్యాల్: ఆలేడ్‌లో నిర్వహించిన గ్రామ సభ

మర్పల్లి: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద 2024–25 సంవత్సరానికి గాను గ్రామంలో చేపట్టే పనులను గుర్తించేందుకు గ్రామ సభ నిర్వహించామని కల్‌ఖోడ పంచాయతీ కార్యదర్శి చందు తెలిపారు. బుధవారం మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని కార్యదర్శి చందు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టే ఉపాధి పనులకు సభలో తీర్మానం చేసి నిధుల కోసం ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. సభలో మాజీ సర్పంచ్ రాచన్న, ఈసీ విఠల్, ఆయా రాజకీయ పార్టీల నాయకులు, ఉపాధి సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామస్తుల తీర్మానం

దుద్యాల్: మండల పరిధిలోని ఆలేడ్ గ్రామంలో ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేపట్టేందుకు గ్రామస్తుల సమక్షంలో పంచాయతీ కార్యదర్శి రమేశ్ తీర్మానం చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా గ్రామ శివారులోని రామలింగేశ్వరస్వామి దేవాలయం వెనుకనున్న వాగులో నీరు వృథా కాకుండా, నిల్వ ఉండేందుకు అవసరమైన చెక్ డ్యామ్‌లు నిర్మించాలని నిర్ణయించుకున్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ భారతి, ఆశ కార్యకర్త అనురాధ గ్రామస్తులు అనంతయ్య, శ్రీధర్‌గౌడ్, నారాయణగౌడ్, అశోక్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోట్‌పల్లిలో..

బంట్వారం: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించిన ప్రణాళికలను రూపొందించేందుకు బుధవారం కోట్‌పల్లి మండలంలో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పలు అంశాలపై గ్రామస్తులతో చర్చించి వివరించారు. చేపట్టే పనులు, ఖర్చు చేసే నిధులు, కూలీలకు పని కల్పించడంపై గ్రామస్తులకు వివరంగా చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ డానియల్, ఆఫీసర్ వేణుమాధవ్, ఈజీఎస్ ఏపీఓ ఎలిషా, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



తాండూరు: గుమస్తానగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



వికారాబాద్‌లో సిద్ధార్థ స్కూల్‌లో

బతుకమ్మ సంబరాలు

తాండూరు: పట్టణంలో బతుకమ్మ సంబరాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం రాష్ట్ర పండుగైన బతుకమ్మ ఉత్సవాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వార్డులలో మహిళలు పూలతో బతుకమ్మలను పేర్చి ఆట పాటలతో సందడి చేశారు.



అనంతగిరి: గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి



కొడంగల్ : నివాళులర్పిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు



తాండూరు టౌన్: తాండూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో..



పరిగి: 'స్వచ్ఛ భారత్'లో మున్సిపల్ చైర్మన్ తదితరులు



మోమిన్‌పేట: మండల పరిషత్ కార్యాలయంలో..



ధారూరు: మోమిన్‌కలాన్ గ్రామంలో..

మహాత్ముడి మార్గం ఆదర్శనీయం

యుద్ధమేఘాలు కమ్ముకున్న ప్రస్తుత ప్రపంచానికి మహాత్ముడి బాటే ఏకైక పరిష్కారమని జాతిపిత జయంతి సందర్భంగా వక్తలు అభిప్రాయపడ్డారు. ఆయన చూపిన శాంతి, సత్యం, అహింస మార్గాలే ప్రపంచానికి ఆదర్శమన్నారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా మహాత్మా గాంధీ జయంతిని వైభవంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మహాత్ముడి విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలుచోట్ల అధికారులు, నాయకులు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో జాతిపిత జయంతితో పాటు భారత రెండో ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి జయంతిని నిర్వహించారు. – సాక్షి, నెట్‌వర్క్



అనంతగిరి: మహాత్ముడికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్లు, ఇతర అధికారులు



తాండూరు టౌన్: గాంధీ చౌక్‌లో నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్



దుద్యాల్: హస్నాబాద్‌లో..



బంట్వారం: కొత్తపల్లి గ్రామంలో..



దోమ: తహసీల్దార్ కార్యాలయం వద్ద..



మర్పల్లి: మండల పరిషత్ కార్యాలయంలో..



పూడూరు: అంగడి చిట్టంపల్లిలో స్వచ్ఛ భారత్



యాలాల: మండల కేంద్రంలో..



పెద్దేముల్‌లో..

కార్మికుల ఆరోగ్యంపై దృష్టి



కొడంగల్: సన్మానం చేస్తున్న మున్సిపల్ చైర్మన్



తాండూరు టౌన్: కార్మికులకు మందులు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నాపరిమళ్

తాండూరు టౌన్: మున్సిపల్ కార్మికులు ఆరోగ్య పరిరక్షణపై దృష్టి సారించాలని తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నాపరిమళ్ అన్నారు. బుధవారం జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. చైర్‌పర్సన్ సైతం ప్రాథమిక వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిత్యం మురుగునీరు, చెత్తా చెదారాన్ని శుభ్రం చేస్తూ వ్యాధికారక క్రిములతో పోరాటం చేసే కార్మికులు వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ విక్రమ్‌సింహా రెడ్డి, మేనేజర్ నరేందర్ రెడ్డి, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

కొడంగల్: మున్సిపల్ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులను బుధవారం సన్మానించారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య విధుల్లో మెరుగైన సేవలు అందించిన శానిటేషన్ సిబ్బందికి మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉషారాణి, మున్సిపల్ కమిషనర్ బల్‌రాంనాయక్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక దృఢత్వం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

కుల్కచర్ల: క్రీడల్లో పాల్గొనడంతో శారీరక దృఢత్వం సిద్ధిస్తుందని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, బీజేపీ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సౌమ్యారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సూపర్ 8 క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువకులు క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసిక ప్రశాంతతను పొందుతారన్నారు. పంచాయతీ కార్యదర్శి భాస్కర్, నాయకులు కుమ్మరి స్వామి, వినోద్, నర్సింలు, మురళి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో శుక్రవారం నుంచి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అబ్బు, మజార్ తెలిపారు. ఈ పోటీలకు క్రీడాకారులు టీం పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. మొదటి విజేతకు రూ.25 వేలు, రెండో విజేతకు రూ.15వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇతర వివరాలకు 99494 76990, 91001 79902 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.